దేశ ఆర్థికం హస్తవ్యస్తం

యూపీఏ పాలనలో ఆర్థిక వ్యవస్థ నాశనం

సంస్కరణలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలం

స్వల్పకాలిక ప్రయోజనాలపైనే దృష్టి పెట్టారు

దేశ ఆర్థిక పునాదుల బలోపేతానికి చర్యలు శూన్యం

ఆర్థిక క్రమశిక్షణ ఏమాత్రం పాటించలేదు

యూపీఏ పదేండ్ల పాలనలో పెచ్చరిల్లిన అవినీతి

పార్లమెంటుకు సమర్పించిన శ్వేతపత్రంలో కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: యూపీఏ పదేండ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని, అవినీతి పెచ్చరిల్లిపోయిందని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర ఆరోపణలు చేసింది. దీర్ఘకాలిక ఆర్థిక పరిపుష్టికి యూపీఏ ప్రభుత్వం ఏమాత్రం చర్యలు తీసుకోలేదని, స్వల్పకాలిక ప్రయోజనాల కోసమే నిర్ణయాలు తీసుకొన్నదని ఆరోపించింది. 2004 నుంచి 2014 వరకు సాగిన యూపీఏ పాలనపై మోదీ సర్కారు రూపొందించిన శ్వేతపత్రాన్ని గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టారు. పత్రాన్ని చదివి వినిపించిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్, ఎన్డీయే పదేండ్ల పాలనలో దేశం ఎంతో గొప్పగా ఆర్థిక ప్రగతి సాధించిందని చెప్పుకొచ్చారు. యూపీఏ పాలనలో ఆర్థిక క్రమశిక్షణ కొరవడటంతో ద్రవ్యలోటు భారీగా పెరిగిపోయిందని విమర్శించారు. మౌలిక వసతుల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని, సామాజికాభివృద్ధి పథకాలకు నిధులను సక్రమంగా ఇవ్వలేదని దుయ్యబట్టారు. యూపీఏ పదేండ్ల పాలనలో సగటు ద్రవ్యోల్బణం 8.2 శాతంగా ఉండేదని, దానిని తగ్గించేందుకు ప్రభుత్వం ఏమీ చేయలేదని ఆరోపించారు. 2004లో యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేవరకు ఎంతో ఆరోగ్యంగా, 7 శాతం వృద్ధితో దూసుకుపోయిన ఆర్థిక వ్యవస్థను.. ఆ తర్వాత పదేండ్లలో తిరోగమనంలోకి తీసుకెళ్లారని విమర్శించారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానమంత్రిగా ఉన్న మన్మోహన్‌సింగ్ రాజ్యసభ పదవీకాలం గురువారమే ముగిసింది. అదేరోజు ఆయన ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ మోదీ సర్కారు పార్లమెంటులో శ్వేతపత్రం ప్రవేశపెట్టడం గమనార్హం. మన్మోహన్‌సింగ్‌కు వీడ్కోలు పలుకుతూ ప్రధాని మోదీ పార్లమెంటులో మాట్లాడారు. మన్మోహన్‌సింగ్ ఆరోగ్యం సహకరించకపోయినా వీల్‌చైర్‌లో ఉంటూ కూడా కష్టపడి పనిచేశారని కీర్తించటం విశేషం.

గురువారం లోక్‌సభలో మాట్లాడుతున్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

> 2008లో వచ్చిన ఆర్థిక మాంద్యాన్ని (2008 ఆర్థిక మాంద్యానికి భారత్ గురికాలేదు) చూసి కూడా యూపీఏ ప్రభుత్వం తన విధానాలపట్ల పశ్చాత్తాపపడలేదు. అప్పులు చేస్తూనే పోయింది.

శ్వేతపత్రంలోని వివరాలు

- ఎంతో ఆరోగ్యంగా, మరిన్ని సంస్కరణలకు సిద్ధంగా, వృద్ధిపథంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను యూపీఏ ప్రభుత్వం నిష్క్రియాపరత్వంగా మార్చేసింది.
- 1991లో ఆర్థిక సంస్కరణలు తెచ్చిన కాంగ్రెస్ పార్టీనే 2004లో మళ్లీ అధికారంలోకి వచ్చాక ఆ ఘనతను కొనసాగించలేకపోవటంలో వైఫల్యం చెందటం విషాదం.
- 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం ముగిసిన తర్వాత యూపీఏ ప్రభుత్వం ఏ దశలోనూ దేశ ఆర్థిక వృద్ధిని మళ్లీ పెంచలేకపోయింది. స్థూల ఆర్థిక పునాదులను బలహీనపర్చింది. అందులో ఒకటి ధరల స్థిరత్వం.
- బ్యాంకింగ్ సంక్షోభం యూపీఏ ప్రభుత్వ అపకీర్తుల్లో ప్రధానమైనది. ఈ సంక్షోభం వల్ల భారీ సంపద దోపిడీకి గురైంది.
- విదేశీ వాణిజ్య అప్పులపైనే ఆధారపడటంతో ఆర్థికవ్యవస్థ ప్రమాదంలో పడింది.
- 2008లో వచ్చిన ఆర్థిక మాంద్యానికి విరుగుడుగా యూపీఏ ప్రభుత్వం ప్రకటించిన ఉద్దీపనలు అసలు సమస్యకు మించి దుష్ప్రభావాలు చూపాయి.
- పబ్లిక్ ఫైనాన్స్ నిర్వహణ ప్రమాదకర స్థితిలోకి వెళ్లింది. ద్రవ్యలోటు ఆర్థికవ్యవస్థకు శరాఘాతంగా మారింది.
- ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్త నిర్వహణ వల్ల ద్రవ్యలోటు అంచనాలను మించిపోయి, అప్పులు నిర్ణయించినదానికంటే 27 శాతం అధికం అయ్యాయి.
- ఆర్థిక వ్యవస్థకు ద్రవ్యలోటు మోయలేని భారంగా మారింది.
- యూపీఏ ప్రభుత్వం మార్కెట్ నుంచి అప్పులు అడ్డగోలుగా తీసుకోవటమే కాకుండా.. వాటిని అధికంగా అనుత్పాదక రంగాల్లోనే ఖర్చుచేసింది.
- మౌలిక వసతుల అభివృద్ధిలో కుట్రపూరిత నిర్లక్ష్యం, లాజిస్టికల్ రంగంలోని సవాళ్లను పరిష్కరించకపోవటంతో పారిశ్రామికరంగ వృద్ధి తీవ్రంగా ప్రభావితమైంది. యూపీఏ ప్రభుత్వం అతిగా రెవెన్యూ వ్యయం చేసిందని ఆర్బీఐ కూడా తేల్చింది.
- ప్రణాళికా రచన, అమలులో లోపాలవల్ల సామాజికాభివృద్ధి పథకాలకు కేటాయించిన నిధుల్లో చాలావరకు ఖర్చు కాకుండా మిగిలిపోయాయి.
- వైద్యరంగంలో మౌలిక వసతుల కల్పనలో జరిగిన నిర్లక్ష్యం భారతీయ కుటుంబాలకు తీవ్ర వేదనను మిగిల్చింది.
- నిధుల్లో అత్యధికం ఉత్పాదకత రంగాలకు కాకుండా, అనుత్పాదక రంగాలకే కేటాయించటానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది.
- దేశానికి అత్యంత కీలకమైన రక్షణ సన్నద్ధతతోపాటు దేశ దీర్ఘకాలిక అభివృద్ధిపై యూపీఏ ప్రభుత్వం ఏనాడూ ఎవరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవటంతో విధానాలు నిస్తేజం అయిపోయాయి.
- సముద్రతీర జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధిని యూపీఏ నిషేధించింది.
- దేశంలో అతిపెద్ద విద్యుత్తు సంక్షోభం యూపీఏ హయాంలోనే ఏర్పడిందన్న విషయం గుర్తుంచుకోవాలి. 2012లో 62 కోట్లమంది అంధకారంలోకి వెళ్లిపోయారు. దేశ భద్రత ప్రమాదంలో పడింది. నాడు విద్యుత్తు సమస్యలపై అంతర్జాతీయ సంస్థలు పదేపదే గుర్తుచేశాయి.
- ప్రభుత్వ వ్యవస్థ, విధానాలు అక్రమ సంపాదనకు ఎలా ఆలవాలం అయ్యాయో చెప్పేందుకు బంగారం ఎగుమతి-దిగుమతిపై 80:20 నిష్పత్తి పథకమే ఉదాహరణ. యూపీఏ హయాంలో నిర్ణయాల్లో స్తబ్దతకు ఉదాహరణలు కోకొల్లలు.
- దేశంలో డిజిటల్ రంగం స్వయంసమృద్ధికి గుర్తుగా నిలిచిన ఆధార్ కూడా యూపీఏ పాలనలో ఇబ్బందులపాలైంది.
- దేశ రక్షణ సన్నద్ధత విషయంలో యూపీఏ ప్రభుత్వం రాజీపడింది. రక్షణ రంగంలో అనేక కుంభకోణాలు వెలుగుచూశాయి. అనేక అభివృద్ధి పథకాలు కుంటుపడ్డాయి.
- ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోరుతుండగా, యూపీఏ ప్రభుత్వం అస్థిర విధానాలను దేశానికి అందించింది.
- యూపీఏ పారిశ్రామిక నిరుత్సాహ విధానాలతో చాలామంది దేశీయ పెట్టుబడిదారులు విదేశాలకు వెళ్లిపోయారు.
- వాజ్‌పేయి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేసి, అద్భుత సంస్కరణలు ప్రవేశపెట్టినా ఆ తర్వాత వచ్చిన యూపీఏ ప్రభుత్వం వాటిని కొనసాగించలేకపోయింది.
- భారత ఆర్థిక వృద్ధి మందగమనానికి అంతర్జాతీయ కారణాలతోపాటు దేశీయ కారణాలు కూడా ప్రధాన కారణమేనని 2012-13 ఆర్థిక సర్వేనే స్పష్టంచేసింది.

> యూపీఏ పదేండ్ల పాలనంతా తప్పుడు విధాన సాహసాలు, కుంభకోణాలే. 2014లో బొగ్గు కుంభకోణం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. 2జీ కుంభకోణం వల్ల భారత టెలికం రంగం ఎంతో విలువైన ఒక దశాబ్ద కాలాన్ని కోల్పోయింది.

> 2004 కంటే ముందు ఉన్న ప్రభుత్వాలు చేపట్టిన ఆర్థిక సంస్కరణల వల్ల యూపీఏ ప్రభుత్వం లాభపడింది. కానీ, ఆ విధానాలను కొనసాగించటంలో విఫలమైంది.

ఆర్థిక వ్యవస్థకు చికిత్స చేశాం..

- మా (ఎన్డీయే) ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిడిలో ఉన్నది. మేం రాగానే అత్యవసరంగా చేపట్టాల్సిన చర్యలను గుర్తించి ఆర్థిక వ్యవస్థకు చికిత్స చేశాం. దీంతో దేశం అసాధారణ లక్ష్యాలను చేరుకొన్నది. నల్లధనాన్ని అరికట్టేందుకు నిరంతర చర్యలు చేపట్టాం. అదే సమయంలో ఆరోగ్యకరమైన వ్యాపార వాతావరణాన్ని సృష్టించాం.
- స్థూలంగా ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేసేందుకు 2014 నుంచి అనేక సాహసోపేత సంస్కరణలు చేపట్టాం. దీంతో ఆర్థిక వ్యవస్థ పెళుదనం నుంచి ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారింది.
- నేషన్ ఫస్ట్ అనే మా విధానంలో భాగంగా దేశంలో నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించాం. ఇవి దేశానికి ఎంతో కీలకం. అంతర్జాతీయ వాణిజ్య గొలుసుతో అనుసంధానమయ్యేందుకు కూడా ఎంతో ముఖ్యం.
- మేం అధికారంలోకి వచ్చినప్పుడు దేశంలో జాతీయ రహదారుల నిర్మాణం రోజుకు 12 కిలోమీటర్ల చొప్పున ఉండగా, 2023 నాటికి రోజుకు 28 కిలోమీటర్లకు పెంచాం.
- 2014లో విదేశీ మారక నిల్వలు 303 బిలియన్ డాలర్లు ఉండగా, 2024 జనవరి నాటికి 617 బిలియన్ డాలర్లకు పెంచాం. నిర్మాణాత్మక జీఎస్టీ వ్యవస్థను తెచ్చాం.
- నిజమైన సహకార సమాఖ్య స్ఫూర్తితో అభివృద్ధిలో అందరికీ సమభాగస్వామ్యం కల్పించాం.

> యూపీఏ ప్రభుత్వ అస్తవ్యస్త ఆర్థిక, ద్రవ్య విధానాల వల్ల ఆ ప్రభుత్వ చివరి రోజుల నాటికి దేశ వృద్ధి సామర్థ్యం తీవ్రంగా పడిపోయింది. దీంతో ఆర్థిక వ్యవస్థ పెళుసుగా తయారైంది.

మోదీ సర్కార్ వైఫల్యాలపై బ్లాక్‌పేపర్

నిరుద్యోగం, ధరల కట్టడిలో కేంద్రం విఫలం: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: కేంద్రంలో మోదీ సర్కార్ వైఫల్యాల్ని ఎత్తిచూపుతూ కాంగ్రెస్ పార్టీ గురువారం 'బ్లాక్ పేపర్'ను విడుదల చేసింది. గత 10ఏండ్లుగా మోదీ సర్కార్ దేశానికి అన్యాయం చేస్తున్నదని ఆరోపించింది. తన పదేండ్ల పాలనపై కేంద్రంలోని అధికార బీజేపీ తాజాగా పార్లమెంట్‌లో శ్వేతపత్రం (వైట్ పేపర్)ను విడుదల చేసింది. దీనికి కౌంటర్‌గా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, '10 సాల్ అన్యాయ్‌కాల్' పేరుతో 54 పేజీల బ్లాక్ పేపర్‌ను విడుదల చేశారు. 'ప్రధాని మోదీ తన వైఫల్యాల్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వాటి గురించి విపక్ష సభ్యులు మాట్లాడితే, పార్లమెంట్‌లో ప్రాధాన్యం ఇవ్వటం లేదు. అందుకే వాస్తవాల్ని ప్రజలకు తెలిపేందుకు బ్లాక్ పేపర్‌ను తీసుకొచ్చాం' అని మీడియాతో మాట్లాడుతూ ఖర్గే అన్నారు. నిరుద్యోగం, ధరల కట్టడి, రైతుల సమస్యలను తీర్చటంలో కేంద్రం విఫలమైందని, బీజేపీయేతర రాష్ట్రాల్లో ప్రభుత్వాల్ని కుట్రపూరితంగా కూల్చుతున్నదని ఈ పత్రంలో కాంగ్రెస్ ఆరోపించింది.

జీవన వ్యయానికి.. వేతనానికి పొంతనేది?

ఉపాధి హామీ పథకంపై పార్లమెంటరీ కమిటీ ఆవేదన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చెల్లిస్తున్న రోజువారీ వేతనాలు అసమతుల్యంగా ఉన్నాయని పార్లమెంటరీ కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. పెరుగుతున్న జీవన వ్యయానికి, వేతనాలకు పొంతన లేదని తెలిపింది. ఈ కారణంగా ఈ పథకంలో పనిచేసే వారి సంఖ్య తగ్గిపోతున్నదని వెల్లడించింది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌పై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న వేతనాల్లో భారీ తేడా ఉన్న విషయాన్ని ప్రస్తావించింది. 'మధ్యప్రదేశ్‌లో రూ.221, సిక్కింలోని మూడు గ్రామ పంచాయతీల్లో రూ.354, అండమాన్‌లో రూ.311 వేతనంగా ఇస్తున్నారు' అని కమిటీ పేర్కొంది. 2008 నుంచి ఈ పథకంలో అమలు చేస్తున్న వేతనాలను పరిశీలించిన కమిటీ... పెరుగుతున్న జీవన వ్యయానికి అవి సరిపోవని తెలిపింది. కనీస వేతనాలపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక కమిటీ ఉపాధి హామీ పథకంలో ఒక రోజుకు రూ.375 వేతనంగా ఇవ్వాలని ప్రతిపాదించిందని గుర్తుచేసింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఉపాధి హామీ వేతనాలను పెంచాలని ప్రభుత్వానికి సూచించింది. ఉపాధి హామీ వేతనాలను గణిస్తున్న పద్ధతి ప్రస్తుతం వాడుకలో లేదని తెలిపింది. ఈ పథకానికి కేటాయించిన బడ్జెట్‌లోనూ అసమతుల్యత కనిపిస్తున్నదని కమిటీ చెప్పింది. ప్రస్తుత దేశ బడ్జెట్‌లో ఈ పథకానికి నిధులు తగ్గించడం కలవరం కలిగిస్తున్నదని.. ఈ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నది.

68 మంది ఎంపీలకు రాజ్యసభ వీడ్కోలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఈ ఏడాది రాజ్యసభ నుంచి రిటైర్ కానున్న 68 మంది ఎంపీలకు చైర్మన్ జగ్‌దీప్ ధన్‌కర్ ఘనంగా వీడ్కోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఔన్నత్యాన్ని పెంపొందించేందుకు సభ్యులు ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. వీరి రిటైర్ కారణంగా సభలో కొంత వెలితి కనిపిస్తున్నదని చెప్పారు. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన పార్లమెంటరీ వ్యవస్థలో భాగస్వాములైన వీరందరి పేరు చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రిటైరవుతున్న వారిలో పలువురు కేంద్రమంత్రులు ఉన్నారు.

ఈవీఎంలకు ఆపరేటింగ్ సిస్టమ్ ఉండదు:ఈసీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఎన్నికల్లో ఉపయోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)కు ఆపరేటింగ్ సిస్టమ్ (ఓఎస్) ఉండదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. తరచూ అడిగే ప్రశ్నల విభాగాన్ని ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో బుధవారం అప్‌డేట్ చేసింది. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయవచ్చా అన్న ప్రధాన ప్రశ్నకు సమాధానమిస్తూ ఈవీఎంలకు ఆపరేటింగ్ సిస్టమ్ ఉండదని ఈసీ స్పష్టం చేసింది. వన్‌టైమ్ ప్రోగ్రామ్ కింద రాసిన ఫర్మ్‌వేర్ లేదా, మెషిన్ స్థాయి ఆదేశాల ద్వారా మాత్రమే ఇది పనిచేస్తుందని తెలిపింది.

హల్ద్వానీలో హైటెన్షన్

- మదర్సా కూల్చివేతతో చెలరేగిన హింస
- వాహనాలకు నిప్పు.. 60 మందికి గాయాలు
- కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు

హల్ద్వానీ, ఫిబ్రవరి 8: ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ నగరంలో గురువారం మదర్సా కూల్చివేత సందర్భంగా చెలరేగిన హింసలో 60 మందికి పైగా గాయపడ్డారు. కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడంగా నిర్ధారించిన మదర్సాను అధికారులు కూల్చివేయడానికి ప్రయత్నించినప్పుడు అల్లరి మూక వారిపై రాళ్లు రువ్వింది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో కనిపిస్తే కాల్చివేత, కర్ఫ్యూ ఉత్తర్వులను జిల్లా మెజిస్ట్రేట్ జారీ చేశారు. మసీదు పక్కనే గల మదర్సాను జేసీబీతో కూల్చివేయడానికి అధికారులు, పోలీసులు ప్రయత్నించినప్పుడు అల్లరి మూక రాళ్ల దాడి చేసింది. ఈ ఘటనలో పోలీసులు, అధికారులు, పాత్రికేయులు గాయపడ్డారు. అల్లరి మూకను చెదరగొట్టడానికి పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించగా.. హింస మరింత ఎక్కువైంది. పోలీస్ స్టేషన్ బయట ఉన్న వాహనాలకు నిరసనకారులు నిప్పు పెట్టారు. నిందితులను గుర్తించామని.. త్వరలోనే అరెస్ట్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ పంకజ్ ఉపాధ్యాయ్ వెల్లడించారు.

గురువారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలో పాల్గొన్న కేజ్రీవాల్, సీతారాం ఏచూరి, విజయన్, భగవంత్ మాన్, డీ రాజా, ఫరూక్ అబ్దుల్లా

కేంద్రం వివక్షపై విపక్షాల కన్నెర్ర

- ఢిల్లీలో కేరళ, తమిళ నాడు ముఖ్యమంత్రుల నిరసన
- కేజ్రీవాల్, ఫరూక్ సంఘీభావం

న్యూఢిల్లీ: నిధుల కేటాయింపులో కేంద్రం చూపుతున్న తీవ్ర వివక్షపై దక్షిణాది రాష్ట్రాలు కన్నెర్ర చేశాయి. ప్రధాని మోదీ వైఖరిని నిరసిస్తూ గురువారం దేశ రాజధానిలో కేరళకు చెందిన లెఫ్ట్ ఫ్రంట్, తమిళనాడుకు చెందిన డీఎంకే విడివిడిగా నిరసనలు వ్యక్తం చేశాయి. నిధుల విడుదలలో చూపుతున్న నిర్లక్ష్యం, పక్షపాత వైఖరిని అవి ఎండగట్టాయి. వారికి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, జమ్ము-కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా, ఇతర నేతలు సంఘీభావం ప్రకటించి ఆందోళనలో పాల్గొన్నారు. కేరళ సీఎం పినరయి విజయన్‌తో పాటు ఎల్డీఎఫ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో పాటు సీపీఐ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి తదితరులు ఉదయమే చలిలో కేరళ హౌస్ నుంచి జంతర్ మంతర్ వరకు ర్యాలీ నిర్వహించారు. స్వతంత్ర దేశ చరిత్రలో 2024 ఫిబ్రవరి 8ని 'రెడ్ లెటర్ డే'గా లిఖించదగిన రోజని సీఎం విజయన్ విమర్శించారు. యూనియన్ ఆఫ్ స్టేట్స్‌గా పరిగణించే ప్రజాస్వామ్యం నెమ్మదిగా, క్రమంగా యూనియన్ ఓవర్ స్టేట్స్‌గా కుంటుపడుతున్నదని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఉత్తర, దక్షిణ తేడాలు చూపిస్తూ వివక్ష ప్రదర్శిస్తున్నదని, కానీ కేరళ, తమిళనాడు నేతలతో కేజ్రీవాల్, పంజాబ్ సీఎం, భగవంత్ మాన్ లాంటి వారు కలవడం చూస్తేంటే వారి కలాంటి భేద భావాలేవీ లేవని అర్థమవుతుందని సీతారాం ఏచూరి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రాలను మున్సిపాల్టీలుగా భావిస్తున్నారని, అందుకే వాటికి అధికారాలు ఇవ్వకుండా చేస్తున్నారని, అందుకే అవి వీధెక్కి పోరాటాలు చేయాల్సి వస్తున్నదని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ జంతర్‌మంతర్ సభలో విమర్శించారు. కేంద్రం వైఖరికి నిరసనగా డీఎంకే, దాని సంకీర్ణ పార్టీల ఎంపీలు గురువారం నల్ల చొక్కాలు ధరించి పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

విపక్ష రాష్ట్రాలపై కేంద్రం యుద్ధం: కేజ్రీవాల్

విపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలతో కేంద్రం యుద్ధం చేస్తున్నదని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. విపక్ష పార్టీలు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు దేశంలో 70 కోట్ల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయన్నారు.

మహారాష్ట్ర కాంగ్రెస్‌కు మరో షాక్

పార్టీకి గుడ్ బై చెప్పిన మాజీ మంత్రి బాబా సిద్దిఖీ

ముంబై, ఫిబ్రవరి 8: మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. నెల రోజుల క్రితం కాంగ్రెస్ నాయకుడు మిలింద్ దేవ్‌రా పార్టీని వీడగా, తాజాగా మరో సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాబా సిద్దిఖీ పార్టీకి రాజీనామా చేశారు. అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో చేరుతున్నట్టు తాజాగా ప్రకటించారు. 48 ఏండ్లుగా పార్టీలో కొనసాగిన ఆయన కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో గురువారం సందేశాన్ని పోస్ట్ చేశారు. సిద్దిఖీ కుమారుడు జీషన్ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నారు.

ఫేస్‌బుక్ లైవ్‌లో శివసేన నేత కుమారుడి కాల్చివేత

ముంబై: శివసేన (యూబీటీ) నేత కుమారుడిని ఒక వ్యక్తి కాల్చి చంపి తానూ ఆత్మహత్య చేసుకున్న ఘటన ముంబైలో చోటుచేసుకుంది. ఎంహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దహిసార్ ప్రాంతంలో శివసేన (యూబీటీ) మాజీ కౌన్సిలర్ వినోద్ ఘోసల్కర్ కుమారుడు అభిషేక్ ఘోసల్కర్ ఫేస్‌బుక్ లైవ్‌లో ఉండగా ఒక వ్యక్తి తుపాకీతో అతడిపై కాల్పులు జరిపాడు. తర్వాత అదే తుపాకీతో తానూ కాల్చుకున్నాడు. ఇదంతా ఫేస్‌బుక్ లైవ్‌లో రికార్డయ్యింది. ఈ హత్యకు కారణాలు వెల్లడి కాలేదు.

పార్లమెంట్ ముట్టడికి బయల్దేరిన రైతులను ఢిల్లీ- నోయిడా సరిహద్దుల్లో అడ్డగించిన పోలీసులు

హస్తినను తాకిన కిసాన్ సెగ

పార్లమెంట్ ముట్టడికి రైతు సంఘాల పిలుపు

- భారీగా రోడ్లపైకి వచ్చిన అన్నదాతలు
- ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు.. భారీగా నిలిచిపోయిన వాహనాలు

గురువారం ఢిల్లీ-మీరట్ ఎక్స్‌ప్రెస్‌వేపై భారీగా ట్రాఫిక్ జామ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నోయిడా, గ్రేటర్ నోయిడా పరిధిలోని రైతులు పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం చేపట్టడంతో ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అన్నదాతలను అడ్డుకునేందుకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటుచేయడంతో ఢిల్లీ-నోయిడా సరిహద్దుల్లో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులే కాక సామాన్య ప్రజలు కూడా నానా అవస్థలు పడ్డారు. రైతుల ముట్టడి కార్యక్రమం దృష్ట్యా అవాంఛిత సంఘటనలు జరగకుండా ముందుచూపుతో అల్లర్లను నియంత్రించే వాహనాలతో పాటు జల ఫిరంగులను సైతం పోలీసులు సిద్ధం చేశారు. డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టి రైతులు ఒకే చోట గుమిగూడకుండా అడ్డుకున్నారు

రైతుల నిరసన ఎందుకుంటే..

ప్లాట్లుగా అభివృద్ధి చేస్తామని నమ్మించి తమ నుంచి భూమిని సేకరించి స్థానిక ప్రభుత్వాలు మోసం చేశాయని, తగిన పరిహారం చెల్లించలేదని ఆరోపిస్తూ నోయిడా, గ్రేటర్ నోయిడా పరిధిలోని రైతులు గత కొంతకాలంగా ఆందోళన చేపడుతున్నారు. ఈ క్రమంలోనే పార్లమెంట్ ముట్టడికి పిలుపునిచ్చారు. అయితే భారీ సంఖ్యలో కదిలిన రైతాంగాన్ని మహామాయ ఫ్లై ఓవర్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

రిజర్వేషన్ల కల్పనలో వివక్ష తగదు

- రాష్ట్రాలకు సుప్రీంకోర్టు స్పష్టం
- ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణపై తీర్పు వాయిదా వేసిన కోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపరాదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఇది ప్రమాదకర బుజ్జగింపు ధోరణికి దారితీసే ప్రమాదం ఉన్నదని తెలిపింది. ఎస్సీ, ఎస్టీ కోటా రిజర్వేషన్లను ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు లేదన్న 2004నాటి సుప్రీంకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను ఏడుగురు సభ్యుల విస్తృత ధర్మాసనం విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. అత్యంత వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ ప్రయోజనాలను అందజేస్తున్నప్పుడు రాష్ట్రం ఇతరులను మినహాయించలేదని సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం చెప్పింది. ఉదాహరణకు వెనుకబడిన తరగతులు అధికంగా ఉన్నట్టయితే, రాష్ట్రం కేవలం రెండింటిని మాత్రమే ఎంచుకోగలదా? అని ప్రశ్నిస్తూ.. రిజర్వేషన్ల ప్రయోజనాల నుంచి మినహాయించబడిన వారు ఆర్టికల్ 14 ప్రకారం వారి వర్గీకరణను ఎప్పుడైనా సవాల్ చేయవచ్చు అని తెలిపింది. వెనుకబాటు తనం ఏ మేరకు ఉన్నదో చూసి కులాన్ని వర్గీకరించవచ్చని చెప్పింది. అత్యంత వెనుకబడిన వారికి రిజర్వేషన్లు కల్పించాలని కోరుతున్నట్టు చెప్పింది. కానీ అత్యంత వెనుకబడిన వారికి ప్రయోజనాలు కల్పిస్తున్నప్పుడు ఇతరులను మినహాయించలేరని, ఇది అత్యంత ప్రమాదకరమని ధర్మాసనం పేర్కొంది. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని కులాలను ఎంచుకుంటే మరికొన్ని రాష్ట్రాలు మరికొన్ని కులాలను ఎంపిక చేస్తాయి.. అసలు ఈ ఆలోచన ప్రజాదరణ రాజకీయాల కోసమా? మేమే ప్రమాణాలను నిర్దేశించడం ద్వారా దీన్ని సరిదిద్దుతామని ధర్మాసనం పేర్కొన్నది. కేంద్రం, రాష్ట్రాలు, తదితరుల వాదనలు విన్న అనంతరం న్యాయస్థానం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. రిజర్వేషన్లు కల్పించటం, సామాజిక వెనుకబాటు తనాన్ని తొలగించటం, ఆ పని చేస్తూనే సామాజికంగా ఎదుర్కొంటున్న అసమానతలను తొలగించడం రాష్ట్రం పాత్ర అని ధర్మాసనం తెలిపింది.

● మంచు పరుపు

ధ్రువపు ఎలుగుబంటి మంచు పలకపై ఆదమరిచి నిద్రపోతున్న ఈ చిత్రాన్ని బ్రిటిష్ ఔత్సాహిక ఫొటోగ్రాఫర్ నిమా సరిఖాని తీశారు. ఈ చిత్రానికి గాను ఆయన ఈ ఏడాది వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ పీపుల్స్ ఛాయిస్ అవార్డుకు ఎంపికయ్యారు. జంతువులకు, వాటి ఆవాసాలకు మధ్య ఉన్న పరిపూర్ణ అనుబంధాన్ని తెలిపే ఈ చిత్రం వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా ప్రతిబింబిస్తున్నదని లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియం డైరెక్టర్ డగ్లస్ తెలిపారు.

మోదీ పుట్టుకతో ఓబీసీ కాదు

ఆయనది జనరల్ క్యాటగిరీ 'ఘంచి' సామాజికవర్గం: రాహుల్

ఝార్సుగూడ (ఒడిశా)/గాంధీనగర్, ఫిబ్రవరి 8: ప్రధాని మోదీ పుట్టుకతో ఓబీసీ సామాజిక వర్గానికి చెందినవారు కాదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చెప్పారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఉన్న ఆయన మాట్లాడుతూ 'మోదీ ఓబీసీ కుటుంబంలో పుట్టలేదు. వాస్తవానికి ఆయనది ఘంచి (తేలి) సామాజిక వర్గం. అయితే 2000 సంవత్సరంలో గుజరాత్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఘంచి సామాజికవర్గాన్ని ఓబీసీ క్యాటగిరీలో చేర్చారు. దీంతో మోదీ తనది ఓబీసీ సామాజికవర్గం అని చెప్పుకుంటున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు' అని పేర్కొన్నారు. ఓబీసీ సామాజికవర్గానికి చెందిన వాళ్లతో చేతులు కలుపడానికి కూడా ఇష్టపడని మోదీ బిలియనీర్లను మాత్రం హత్తుకుంటారని రాహుల్ విమర్శించారు. రోజుకు నాలుగుసార్లు దుస్తులు మార్చే మోదీ పేదవాడు కాదని తెలిపారు. ఒడిశాలోని అధికార బీజేడీ, బీజేపీ రెండు ఒకటేనని ఆరోపించారు. మరోవైపు గుజరాత్ బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ స్పందిస్తూ ఘంచి సామాజిక వర్గాన్ని ఓబీసీ జాబితాలో కలిపింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. మోదీ ఇంటి పేరు విషయంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై గతంలో పూర్ణేశ్ మోదీ కేసు వేయగా రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోవడం.. మళ్లీ తిరిగి పొందడం తెలిసిందే.